సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న
ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మూసాపేటకు చెందిన పుట్టిగారి అరుణకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ. 2 లక్షల 50 వేల ఆర్థిక సాయం మంజూరైంది. దీంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో సంబంధిత చెక్కును బాధితురాలి భర్త యాదగిరికి ఆదివారం అందజేశారు.

తోపుడు బండి, వీల్‌చైర్ పంపిణీ



కుత్బుల్లాపూర్: హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకకురాలు అలేఖ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ గాజులరామారం కాంగ్రెస్ కార్యాలయంలో కందుకూరి రేఖకు తోపుడు బండి, దివ్యాంగుడు బాల్‌రెడ్డికి వీల్‌చైర్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభాగ్యులను ఆదుకుంటూ దివ్యాంగులు, మహిళలకు చేయూతనందిస్తున్న హోప్ ఆఫ్ హంగర్ సంస్థ చేపట్టే కార్యక్రమాలకు తనవంతూ చేయూతనందిస్తానన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రవి కుమార్, వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్‌లో శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్‌లో కొందరు బయటి వ్యక్తులు కార్ డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. క్యాంపస్‌లో నిబంధనలకు విరుద్ధంగా బయటి వ్యక్తులు కారుతో పాటు ఇతర వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ, పెంపుడు కుక్కలతో తిరగడం, ఆవులు, గేదలు మొక్కలను పాడుచేయడం, వీడియో షటింగులతో రీల్స్ చేయడం, జంతువులను బలి ఇవ్వడం తదితర కార్యక్రమాలు సెక్యూరిటీ సిబ్బంది ఎదుటే చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బయటి వ్యక్తులు సెక్యూరిటీ సిబ్బంది ముందే కారు డ్రైవింగ్ చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏటా కోటి రూపాయాలు తీసుకుంటున్న ప్రైవేటు సెక్యూరిటీ యాజమాన్యం వర్సిటీ భద్రతను పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మహిళా భవనం ప్రారంభమెప్పుడో..?

- పదేళ్ల క్రితమే పనులు పూర్తి
- నిరూపయోగంగా మారడంతో మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- మరోవైపు చెత్తాచెదారంతో దుర్వాసన



అవంతినగర్ తోటలోని మహిళా భవనం

మోతీనగర్: మూసాపేట డివిజన్‌లోని అవంతినగర్ తోట మహిళా భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. పదేళ్ల క్రితమే పనులు పూర్తయినప్పటికీ అందుబాటులోకి రాకపోవడంతో స్థానిక ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు స్థానిక మహిళల ప్రోగ్రాంలు రోడ్లపైనే నిర్వహించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ పలు శాఖల అధికారుల అలసత్వంతో పనులు ఆమడ దూరంలోనే ఆగిపోతున్నాయి. స్థానిక మహిళలకు స్వయం ఉపాధి కోసం ఇప్పటికే ఎమ్మెల్యే కుట్టు మిషన్లు కూడా అందజేశారు. కానీ భవనం అందుబాటులోకి రాకపోవడంతో మోతీనగర్ వార్డు కార్యాలయంలో గతంలో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ద్వారా ఉచిత శిక్షణ అందించారు. మహిళా భవనం అందుబాటులోకి వస్తే సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుందని పలువురు మహిళా సంఘాల సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 మహిళా సంఘాల గ్రూపులు ఉన్నాయి. వారందరూ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా మొదటిగా మహిళలకు ప్రాధాన్యమిస్తుండడంతో వారంతా ఒకేచోట సామూహికంగా హాజరు కావాలన్నా ప్రస్తుతం ఇబ్బందికరంగా మారింది. మరోవైపు భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో మందుబాబులకు, అసాంఘిక కార్యాకలపాలకు అడ్డగా మారడంతో సమీప ప్రజలు తమ ఇంట్లోని చెత్తాచెదారాన్ని మహిళా భవనం ఆవరణలో పడేయడంతో భవనం అంతా దుర్వాసన వెదజల్లుతోంది. అంతేగాకుండా భవనం ప్రహరీ పక్కన మూతలేని సంపు ఉందని ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యులని సమీప ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మహిళా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మహిళలు కోరుతున్నారు. అయితే ఈ విషయమై జీహెచ్ఎంసీ ఏఈ వర్షిణిని ఫోన్లో సంప్రదించగా ఆమె అందుబాటులో లేరు.



మహిళా భవనంలో ప్రమాదకరంగా సంపు



భవనంలో పేరుకుపోయిన చెత్తాచెదారం



బీటలు వారుతున్న ప్రహరీ

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ తదితరులు



మాధవరం కాంతరావు, బీజేపీ నాయకులు..

అల్విన్‌కాలనీ: తులసీనగర్‌లోని లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా శ్రీ లీలాద్రి క్షేత్ర లక్ష్మీ నరసింహా స్వామి వారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ మాధవరం కాంతారావు దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంగళరావు, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టి గౌడ్, సత్యనారాయణ, ఎస్. యాదగిరి, ఏడుకొండలు, రవి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

బొల్లారం: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బొల్లారం వార్డు-8 పరిధిలో రిసాల బజార్ వాటర్ ట్యాంక్ నుండి కమ్యూనిటీ హాల్ వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శ్రీ గణేష్, మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ భూమిపూజ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో రహదారుల నిర్మాణానికి ప్రధాన ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు డా. నరసింహన్ కన్నన్, వేణు గోపాల్ రెడ్డి, బల్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్: రేపు మేడ్చల్‌లో నిర్వహించే పాలిసెట్‌కు అంతా సిద్ధం చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 13న పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మేడ్చల్‌లోని గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, స్ఫూర్తి, ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల, హైటెక్, హైటెక్ మోడ్రన్, ఎస్ఎస్‌జీ, ఆక్స్‌ఫర్డ్, ఢిల్లీ వరల్డ్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం1.30 వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ అరుంధతి ప్రకటించారు.

అమ్మ లేనిదే సృష్టి లేదు : తలసాని

అమీర్‌పేట: అమ్మ లేనిదే సృష్టి లేదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. త్యాగానికి చిరునామ అమ్మ అని, అమ్మ ప్రేమ వెలకట్టలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, ట్రస్టు అధ్యక్షులు పార్థసారధి పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్.వీ ప్రసాద్ తదితరులు

మోతీనగర్: వయోవృద్ధులను కంటికి రెప్పలాగా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ నెలవారి సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసిన సందర్భంగా సాహిత్య సమావేశాలు, ఉపన్యాసాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నలమాల్పు అంజిరెడ్డి, సెక్రటరీ ఏవీ సాగర్, కోశాధికారి కొల్లప్ప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చొద్దు



మాట్లాడుతున్న సీఐ వెంకట్‌రెడ్డి

మోతీనగర్: ప్రస్తుతం నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చవద్దని అల్లాపూర్ సీఐ ఎస్. వెంకట్‌రెడ్డి సూచించారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో టపాసులు కాల్చివేతతో జరిగే అనర్థాలను వివరించారు. పెద్ద శబ్దంతో టపాసులు కాల్చితే ప్రజలు ఆందోళనకు గురవుతారన్నారు. ఎలాంటి దుష్పరిమాణాలకు ఆస్కారం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చడాన్ని నిషేధించామని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐలు మాజీద్ అలీ, మాల్యా నాయక్, డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి



షాపూర్‌నగర్‌లో ర్యాలీ తీస్తున్న సీఐటీయూ నాయకులు



నినాదాలు చేస్తూ ర్యాలీ తీస్తున్న కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: 'ఆపరేషన్ సిందూర్'లో అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతు బజారు నుంచి ఉషోదయ టవర్స్ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండలాధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్, నాయకుడు సత్యం మాట్లాడుతూ.. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంతో అమాయక ప్రజలు బలవుతున్నారన్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో మన వీర జవాన్లు మురళీనాయక్, సచిన్ యాదవ్ దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని, ప్రపంచదేశాలు కలిసికట్టుగా పాక్ దుశ్చర్యలను వ్యతిరేకించాలని కోరారు. ఉగ్రవాదంతో దేశంలో అలజడులు సృష్టించేందుకు యత్నిస్తున్న పాకిస్తాన్‌పై జరుగుతున్న యుద్ధంలో దేశ ప్రజలు మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ నాయకులు శ్రీను, రావుల స్వాతి, ఖలీల్, గోపాల్, శంకర్, సాధులు, ఆది నాగరాజు, మల్లారెడ్డి, దుర్గా నాయక్ ఉన్నారు.

ఉదయం కాలనీలో..

జీడిమెట్ల: పాక్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్, సచిన్ యాదవ్‌రావుకు ఎస్.ఆర్.నాయక్‌నగర్ కాలనీవాసులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివారం ఉదయం కాలనీకి చెందిన గుబ్బల లక్ష్మణ్, శేషాచారి ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి వీర జవాన్ల పేర్లతో నినాదాలు చేస్తూ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారత జవాన్లు క్షేమంగా ఉండాలని కోరుతూ పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డా.గోపాల్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

జియోఫిజిక్స్‌లో పీహెచ్‌డీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ జియోఫిజిక్ విభాగం నుంచి ప్రియాంక పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ సాధించారు. సైన్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య పర్యవేక్షణలో భౌగోళిక ఎలక్ట్రికల్, జియో కెమికల్ విధానాల అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

ఏపీ ప్రభుత్వ తీరుపై జర్నలిస్టులు, ప్రజా సంఘాల నిరసన



జవహర్‌నగర్‌లో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద నిరసన తెలుపుతున్న నేతలు, జర్నలిస్టులు

జవహర్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తోందని పలు జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కేసుల పేరుతో వేధించడం దారుణమన్నారు. సాక్షి దినపత్రిక సంపాదకుడు ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో ఎలాంటి అనుమతులు, నోటీసులు లేకుండా సోదాల పేరుతో దౌర్జన్యానికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో జర్నలిస్టులు, ప్రజాసంఘాల నేతృత్వంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్, జగ్జీవన్‌రాంల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు శివబాబు, క్రాంతి కళా బృందం అధ్యక్షుడు వెంకటచారి, జంగిడి శ్రీనివాస్, మహనీయుల ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మొగిలిపాక పరశురాం, మేడ్చల్ నియోజకవర్గ జర్నలిస్టులు మండల మురళీధర్, సత్యనారాయణ, అంజిరెడ్డి, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, భూపాల్, జవహర్‌నగర్ జర్నలిస్టులు నర్సింహయాదవ్, నాగరాజు, శ్రీధర్, తూటి శ్రీనివాస్, పోరండ్ల యాదగిరి, లక్ష్మణ్, దేవేందర్, శ్రీనివాస్, వెంకటక్రిష్ణ,కిరణ్ పాల్గొన్నారు.

మారని జీవితం!



నామమాత్రపు వేతనాలతో మున్సిపల్ కార్మికుల సతమతం

- దుర్భర జీవితం గడుపుతున్న సిబ్బంది
- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్
- మరోవైపు వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

జవహర్‌నగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారు. పిన్న వయస్సులోనే పారిశుద్ధ్య కార్మికులు జబ్బు బారినపడి ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకు రోజూ కష్టపడుతున్నా.. పట్టించుకునేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవో 212 ప్రకారం సౌకర్యాలు..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 130 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కాగా గ్రామపంచాయితీ ఏర్పడినప్పటి నుంచి పనిచేస్తున్న సిబ్బందికి మారుతున్న కాలాన్ని బట్టి రోజూవారి వేతనం పెరగడానికి చాలా ఏళ్లు పట్టింది. పారిశుద్ధ్య సిబ్బందికి కనీసవేతనాలు చెల్లించాలని జీవో నెం.212 ప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని అనేక ఏళ్లుగా కార్మిక నాయకులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. 2008 డిసెంబర్ నెలలో కాంట్రాక్ట్ కార్మికులకు పాత జీవోను చట్టం చేస్తూ.. కొత్త జీవో ప్రకారం నెలవారీ జీతంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించారు. బ్యాంకుల ద్వారా జీతాలు ఇవ్వాలని, అది నేటికి అమలు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా జీవో 65 అమలు..

గత ప్రభుత్వం జీవో 14 ప్రకారం అమలు చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం జీవో 65ను అమలు చేస్తోంది. జీవోనెం 60 ప్రకారం వేతనాలు పెంచి, గతంలో కార్మికులకు పెంచిన జీతాలను తగ్గించకుండా వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలు..

పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారి కుటుంబాల్లో రోజూ ఎవరో ఒకరూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్వాసకోస వ్యాధులు, ఇన్‌ఫెక్షన్‌కు గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కార్మికుల జీవితాలకు సరైన భద్రత లేకుండా పోయిందనే విమర్శలున్నాయి.

సగానికి పైగా 25 ఏళ్ల సర్వీసు..

జవహర్‌నగర్ పట్టణంలో పనిచేస్తున్న 130 మంది కార్మికుల్లో సగానికి పైగా 25 ఏళ్ల సర్వీసు ఉన్నవారే. అందరికీ నిర్దిష్ట పని గంటలు ఉన్నా.. వీరికి వర్తించవు. ఇంతచేసినా.. వీరికి ఇచ్చే వేతనం నామమాత్రమే. కాలానికి అనుగుణంగా కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు పట్టణ కార్పొరేషన్ ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఉద్యోగ భద్రత కరువు ..

కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. ఐదేళ్లపాటు పనిచేసిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలనే నిబంధన ఉంది. అయితే స్థానిక సంస్థలకు పూర్తిస్థాయిలో అధికారాలు ఇవ్వకపోవడం వల్ల ఆ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రోజూ అడుగుతున్నప్పటికీ వారిని పట్టించుకునే వారు లేకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జవహర్‌నగర్ ప్రధాన రహదారి పక్కన చెత్తను తొలగిస్తున్న కార్మికులు (ఫైల్)

ఉద్యోగ భద్రత కల్పించాలి..



కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి. జీవిత బీమాను వెంటనే అమలు చేయాలి. తెలంగాణ వస్తే మా ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయని అనుకున్నాం. కానీ నేటికి ప్రభుత్వం అమలు చేయడంలేదు. ప్రతీ కార్మికుడికి రూ.26 వేల కనీసం వేతనం చెల్లించాలి.

– రాములు, ఎలక్ట్రీషన్, జవహర్‌నగర్

హెల్త్‌కార్డులు ఇవ్వాలి..



నిత్యం పారిశుద్ధ్య పనులు చేసుకుంటూ రోగాలబారిన పడుతున్నాం. కనీస వేతనం లేక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులకు హెల్త్‌కార్డులు ఇచ్చి, ఉచిత వైద్యం అందించాలి.

– వెంకటమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటమే..



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెలబెట్టుకుని కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి. కార్పొరేషన్‌లో కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి పర్మనెంట్ చేయాలి. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలి. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలను ఆపేదిలేదు.

– శివబాబు, రాష్ట్ర మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

కుత్బుల్లాపూర్: మురుగునీటి సమస్యను పరిష్కరిస్తామని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అపర్ణ పామ్‌గ్రోవ్‌లో అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మురుగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇప్పటికే నిధులు విడుదల చేసి శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, ఇరిగేషన్ అధికారులు, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వినోద్, దప్పు కిరణ్, పూజారి వసంత, మహిళా అధ్యక్షురాలు సంగీతా ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

గాజులరామారం డివిజన్ నల్లగుట్ట లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఇంద్రసేనా గుప్తా, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణుయాదవ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.